# నేనూ అంతే!

వాల్తేరులో మెయిల్ బండి ఆగింది. జనం క్రిక్కిరిసి మాత్రం లేరు. తేలిగ్గా, అక్కడక్కడ నలుగురేసి ముగ్గురేసి చొప్పున ఉన్నారు. అలా వుంటే నేనూ చులాగ్గా టిక్కెట్లు తనిఖీ చేయవచ్చు.

ప్రస్తుతం నా ప్రయాణపుడ్యూటీ ఇక్కణ్నుంచి పలాసా వరకూను.

ముందు సెకండ్ క్లాస్ కంపార్టుమెంట్ అధిరోహించాను. ప్రయాణీకు లక్కడక్కడా వున్నారు.

'టిక్కెట్ ప్లీజ్!'

అతను టిక్కెట్టు చూపాడు. మెషీన్‌తో ఓ ముక్క త్రుంచి తిరిగీ యిచ్చి వేశాను. కంపార్టుమెంట్ అంతా చెక్ చేయడమైంది. ఇంకా ఇద్దరే మిగిలి వున్నారు. ఒక మగ, ఒక ఆడ. బహుశః దంపతులేమో? ఒక మూలగా కూర్చున్నారు.

'అయ్యా! మీ...' అనేటంతలో అతను నా చేతిలో ఓకాయితం పెట్టాడు. విప్పి చూశాను. ఫ్రీ పాసు. నాకు మల్లేనే అతనొక రైల్వే ఉద్యోగి అన్నమాట.

'ఈమె?....'

'మై బెటర్ హాఫ్' అన్నాడతను.

'ఐ సీ' అన్నాను 'మీ సెర్వంటెక్కడ?' ఆపాసులో సెర్వంటు కూడా వున్నాడు.

'ఇక్కడికి ఓ కంపార్టుమెంట్ తరువాతి కంపార్టుమెంట్‌లో ఉన్నాడు. పిలవమంటారా? పిలుస్తానుండండి... ఒరే భద్రాచలం! భద్రాచలం!'

భద్రాచలం పలుకలేదు.

'ఒరేయ్ భద్రాచలం! ఎక్కడున్నావ్? టీసీగారు చూస్తారట రారా!' అరిచిందామె.

భద్రాచలం ఇంకా పలకలేదు. ఆమెకు ఒళ్లు మండింది.

'ఓరి భద్రాచలం! ఎక్కడ ఛస్తున్నావురా స్టుపిడ్!' అంది.

నేనింకా అలాగే నిలుచున్నాను. భద్రాచలం రాలేదు.

'అయ్యా టీసీగారూ! మీకు ట్రబుల్ ఇస్తున్నాను. శ్రమ అనుకోక ఆ సెర్వెంట్సు కంపార్టుమెంటుకి వెళితే, అక్కడే లభిస్తాడు. నిద్రపోతూంటాడు. కొంచం నల్లమందుగాడు. లైసెన్సు వున్నది లెండి!' అన్నాడాయన.

ఆయన చెబితే వెళ్ళకపోదును, కానీ ఆవిడ సైతం రికమెండ్ చేసింది మరి!

'ఔనండీ టీసీగారూ! తప్పక ఆ సెర్వంట్స్ కంపార్టుమెంట్‌లో వుంటాడు, నిద్రిస్తూ. ఫూలిష్‌ఫెలో! వీడికిదో దురభ్యాసం ఏడిసిందికద!'

'ఫరవాలేదు, నేనే వెళతాలెండి'

ఆమె 'థేంక్స్' అనగా 'నో మెన్షన్' అని కూడా అన్నాను.

సర్వెంట్స్ కంపార్టుమెంటులోనికి వెళ్ళాను.

'భద్రాచలం ఎవరోయ్?'

'నేను!'

పరిశీలనగా ఆపాదమస్తకము చూశాను. నిద్రనుండి అప్పుడే లేచి నట్లున్నాడు. నిజంగా ఓపియమ్ భాయీలాగే వున్నాడు.

'ఝామై మీ అయ్యగారూ, అమ్మగారూ పిలుస్తూంటే పలకవేమిటోయ్? వాళ్లిద్దరూ నీమీద ఫైర్ అయిపోతున్నారు. ఓ మాటు పద!' అన్నాను. సర్వెంట్ భద్రాచలం ఇతనౌనో కాదో అనుమానం నాకు!

భద్రాచలాన్ని వెంట వేసుకు వెళ్ళాను.

'ఏమిరా భద్రీ! ఎక్కడ చచ్చావ్? ఝామై టీసీగారు నీకోసం చూస్తున్నారు. ఇదిగో వస్తున్నాడు, అదిగో వస్తున్నాడంటూ గడిపాను. పెద్దమనిషిని అలా

నించోబెట్టడం ఏం బావుంటుంది చెప్పు?' మందలించారు యజమానిగారు.

'జరిగిందేదో జరిగిందిలే! ఆ బట్టలైనా మార్చుకుని కాస్త శుభ్రమైనవి తొడగరాదట్రా? రెండ్రోజులై ప్రయాణం చేస్తూ అవేబట్టలా? పోయి బట్టలు మార్చుకో... శుభ్రంగా తల దువ్వుకో.... ఆఁ ఇదిగో! మూడు కప్పుల కాఫీ ఒక ట్రేలో పెట్టి తీసుకురా.. త్వరగా!' అన్నది యజమానురాలు.

'అబ్బే మూడు తేకోయ్ భద్రాచలం! రెండే-' అని ఆమెవైపు తిరిగి-

'నా కెందుకండీ ఇప్పుడు కాఫీ! ఇప్పుడే త్రాగడమైంది' అన్నాను.

'మీరు చెప్పండి-కాస్త. ఆయన మొహమాట పడుతున్నట్లున్నారు!' అంటూ భర్తను పొడిచిందామె.

'కాదనకండీ!' అన్నాడాయన. 'పోయిరారా భద్రాచలం!'

భద్రాచలం కిమ్మనలేదు. నేరుగా వెళ్ళిపోయాడు.

మెయిల్ కదిలి పోయింది. భద్రాచలం రాలేదు. నేనలానే కూర్చుండి పోయాను. బండీజోరుగా పరుగులిడుతోంది.

వాల్తేరునించి విజయనగరానికి ముప్పై ఎనిమిది మైళ్ళు. ఈలోగా వున్న ఏ స్టేషన్‌లోనూ మెయిల్ హాల్టులేదు. జర్నీ కొంచెం టీడియస్‌గా వుంటుంది. విజయనగరంలో ట్రెయినాగితే కాని, మరో కంపార్టుమెంట్ తనిఖీకి వెళ్ళలేనాయె!

భర్తను చూసి ఆమె అన్నది.

'చూశారా ఈ భద్రాచలంగాడు! కాఫీ తెచ్చిపెట్టరా అంటే బండి కదిలిపోయింది కాని, వాడు మాత్రం పత్తాలేదు.. వీడిని షూట్ చేసినా పాపం వుందీ? పాపం టీసీగార్ని డిసప్పాయింట్ చేయడమైంది!'

'హాయి హాయిగా నిద్రపోతున్నాడు కాబోలు. మరేముంది మనవాడిపని? ఇంకోర్ని మార్చిపారేస్తానే అంటే వాడేకాని వీల్లేదన్నావ్. అనుభవించు!.. ప్లీజ్ పార్డన్ మీ టీసీ గారూ!'

'అయ్యో ఎంత మాట! ఈ స్వల్ప విషయానికి క్షమించవలసిన దేముంది?' అని సర్ది చెప్పాను.

విజయనగరంలో ట్రెయినాగింది. వాళ్ళవద్ద సెలవు పుచ్చుకుని క్రిందికి దిగాను.

వాళ్ళూ అక్కడే దిగుతున్నారు. భద్రాచలం రాలేదు. ఇద్దరు కూలీల్ని

పిలిచి సామాన్లు దింపిస్తున్నారు. వాళ్ళు నన్ను చూడకుండా, నేను వాళ్ళని చూస్తూ నిలుచున్నాను.

సామానంతా దించుకుని అవతలికి వెళ్లే సన్నాహంలో వుండగా భద్రాచలం వస్తున్నాడు. నాకు జాలివేసింది. బండీ ఆగినవెంటనే రాకుండా, కూలీలచేత అన్ని సన్నాహాలూ చేయించేక వస్తే భద్రాచలానికి తిట్లు తప్పుతాయా? కాఫీ తేలేనందుకే పడ చీవాట్లు తిన్నాడుకదా!

కానీ నేననుకున్నట్లు జరగలేదు. బద్రాచలాన్ని ఎవరూ తిట్టలేదు. పైపెచ్చు భద్రాచలంతోనే అయ్యగారంటారు గదా 'క్షమించండి బావగారూ! ఏం చేయమంటారు చెప్పండీ? ఆ దరిద్రుడు మీ సెర్వంటుని చూపించడంటూ కాల్చుకు తిన్నాడు కదా! ఇంతకీ పాసుల్లో ఇలాంటి అబద్ధాలు చెప్పకపోతే కుదరదాయె!... నువ్వు కూడా మీ ఆయనకు క్షమాపణ చెప్పుకోవే చెల్లాయ్...!

'క్షమించండి స్వామీ! అన్యథా తలంచకండి! పాసులో మరి నేను, మా అన్నయ్యకి భార్యగాను, మీరు మాకు సర్వెంటుగానూ నటించక పోతే వీల్లేదాయె!' అని భద్రాచలం చేతులు పట్టుకుందామె! నేనేమీ ఆశ్చర్య పోలేదు.

ఐతే వెంటనే వారిని పట్టించి కస్టడీలో పెట్టించే తాహతు నాకు లేకపోలేదు! కానీ ఊరుకున్నాను.

రేప్రొద్దున్న పాసుమీద నేను ప్రయాణం చేస్తే?

• జ్యోతి మాసపత్రిక •
జనవరి 1957